

# ఓర్పు-నేర్పు

సి.బి.యన్.ప్రసాద్

"పోస్టుమాన్ !!"

ఉలిక్కిపడి ఈజీ చైర్‌నుండి లేచాను. అంతలోనే పోస్టుమాన్ కవరు ఇంట్లోకి విసిరేసి వెళ్ళిపోయాడు. గబగబా క్రిందబడ్డ కవరు తీసికొని చింపి చదివాడు.

"ప్రియమైన నా విజయ్ !

ఎంతో బాధతో, దుఃఖంతో - ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. కొన్ని రోజుల్నుండీ ఏడవడంతప్ప వేరే గత్యంతరం కనపడ్డంలేదు. నా విజయ్ !! ఘోరం జరిగిపోయింది. మా నాన్నగారు నా పెళ్ళి నిశ్చయం చేశారు. పదిహేనవ తారీఖున పెండ్లి. అంటే ఇంకా ఏడు రోజులుంది. నే నెంతగానో మా నాన్నగారితో మన విషయం చెప్పి మొరపెట్టుకున్నాను. తన

ఒక్కగానొక్క కూతురి జీవితం నాశనం చేయొద్దు అని వేడుకున్నాను. నిన్నే ప్రేమించాను అని గట్టిగా చెప్పాను. కాని మా నాన్నగారు ఎటువంటివారో నీకు తెలుసుగదా— ఆయన గర్జించి— 'ఆ గుమస్తాగాడ్ని చేసుకోవడానికి నీకు సిగ్గులేదూ? అంతగా వాడ్నే చేసుకోవాలనుకుంటే నా కింత విషమిచ్చి, నేను చచ్చింతర్వాత చేసుకో—' అని తీవ్రంగా నిందించారు. విజయ్! ఏం చెయ్యను? ఆడదాన్ని, నా నిస్సహాయతకు నేనే కుమిలిపోతున్నాను."

విజయ్! ఎలాగైనా నన్ను నీదాన్ని చేసుకో. నా మనస్సు నీకే అర్పితం. స్త్రీ ఒకసారే ప్రేమిస్తుంది జీవితంలో... ఏం చెయ్యాలో తోచడంలేదు. మనస్సు మొద్దుబారిపోతోంది.

విజయ్!! నాకు బ్రతకాలని లేదు. చనిపోవాలని, నీ చేతులపైద వ్రాలి, నా తల నీ గుండెలమీద ఆనించి తృప్తిగా ప్రాణాలు వదలాలని నా కోరిక. కనీసం ఈ కోరికైనా తీర్చు విజయ్! ఎవరో వస్తున్నారు. ఇక వుంటా."

ఇట్లు,
నీ భాగ్యరేఖ.

గుండెలు పిండినట్లయింది నాకు. జీవితంలో నేను కావాలనుకున్నవి, కోరుకున్నవి చాలా కోల్పోయాను. ఆఖరుకు నేను ప్రాణసమానంగా ప్రేమించే రేఖ కూడ నాకు దక్కకుండా పోతుందా!! లేదు, వీల్లేదు! అలా కావడానికి వీల్లేదు. వాళ్ళంతా త్రిప్పినట్లయింది. తూలి పడబోయి, నిభాయించుకుని ధైర్యం తెచ్చుకుని తీవ్రంగా ఆలోచించడం మొదలు పెట్టాను.

* * *

భాగ్యరేఖ శివరామయ్యగారి ఏకైక గారాబాల పుత్రిక. సరిగ్గా మూడు సంవత్సరాల క్రితం వాళ్ళ యింట్లో ఒక గదిలో నేను అద్దెకు వుండేవాడ్ని. బ్రహ్మచారికి గది ఇవ్వడానికి శివరామయ్యగారు మొదట ఎంత మొరాయించినా— మా అమ్మ ఎంతో దీనంగా బ్రతిమిలాడేసరికి లొంగిపోయి ఒప్పుకున్నారు. మా గదికి వాళ్ళ యింటికి మధ్యలో ఒక తలుపు వుంది. అవలివైపున వాళ్ళు ఆ తలుపుకు గొళ్ళెం పెట్టుకునేవాళ్లు.

మేము అద్దెకు చేరిన మొదటిరోజు సాయంత్రం మా అమ్మను పలకరించడానికి రేఖ వచ్చింది. అప్పుడు చూశాను ఆమెను. ఎంతో అందంగా వుంది. సన్నగా, పొడుగ్గా, కిలకిలలాడుతూ, నవ్వుతూ కనపడింది. ఆమె అందంలో ప్రత్యేకత ఒకటి వుంది. అదేమంటే ఆమె పలువరస ఎంతో అందంగా వుంటుంది. వర్ణించడం కష్టం. ప్రపంచంలోని ప్రముఖ దంతవైద్యులందరు కలసి, ఆమె పళ్లు, దంతాలు ఎంతో జాగ్రత్తగా అందంగా నిర్మించి ఆమెకు

అమర్చారేమోనని అనిపిస్తుంది. ఆ నగుమోము ఎవరూ మరచిపోలేరు. అంత అందగత్తెను రోజూ చూచే భాగ్యం నాకు కలిగించినందుకు దేవుణ్ణి ఎంతగానో మెచ్చుకున్నాను.

మొదట్లో ఆమెను భయం భయంగా చూసేవాణ్ణి. మల్లెపూవులు వర్షం కురిపించినట్లు నవ్వేది ఆమె. తర్వాత కొంతకాలం చూపులతో, ఆ తర్వాత సైగలతో మాట్లాడుకునేవాళ్ళం.

మా అమ్మతో మాట్లాడ్డానికి వచ్చినట్లు వచ్చి ఆమెతో మాట్లాడుతూ నా వంక చూస్తుండేది. రేఖతో ఎంతో మాట్లాడాలని స్నేహం చేయాలని తహతహలాడేవాడ్ని. కాని అమ్మ ఎక్కడ కోప్పడుతుందోనని, శివరామయ్యగారు ఎక్కడ గది ఖాళీచేయమంటారోనని తెగ భయపడి చచ్చేవాణ్ణి.

ఇలా రోజులూ, వారాలు, నెలలూ దొర్లుతూవుండగా ఒకరోజున- రేఖ పెద్దపెట్టున భయంకరంగా, కెవ్వున అరవడం వినబడింది.

వెంటనే మధ్య తలుపు తోసుకుని, ఒక్క దూకు దూకాను. రేఖ విసురుగా వచ్చి నన్ను కౌగలించుకుంది. మాకు దగ్గరే, ప్రక్కన బుస్, బుస్ అని తీవ్రంగా శబ్దంచేస్తూ ఒక పెద్ద పాము పడగవిప్పివుంది. నాకు గుండె ఆగిపోయినట్లయింది. ఒళ్ళంతా చెమటలు పోశాయి. నాకు స్వతహాగా పాములంటే చచ్చేటంత భయం.

కాని నా ప్రాణం కంటే మిన్నగా ప్రేమించి, ఆరాధించే రేఖ కూడా నాతో పాటు పెద్ద ప్రమాదంలో వుంది. మేధ కొన్ని క్షణాల్లో చురుకుగా పనిచేసింది.

గబగబా ఆమె చీర ఊడబెరికి పాము మీద వల విసిరినట్లు విసరివేశాను. పాము పడగలేపి ఆ చీరెను కాటేసింది. ఎన్నోసార్లు కాటేసింది. కాని ఎటూ పోలేకపోతోంది. వెంటనే ప్రక్కన వున్న ఒక చిన్న కర్రని తీసికొని, నా శక్తినంతా వుపయోగించి దాన్ని నజ్జు, నజ్జుగా కొట్టేశాను. అప్పుడు రేఖ నా వంక చూసిన చూపు, నవ్విన నవ్వు ఎప్పటికీ మరచిపోలేను. ఒకానొక అత్యంత సౌందర్యవతిని నా కౌగిలిలో బిగించుకున్న సంఘటన ప్రతిక్షణం గుర్తుకువచ్చి మధురానుభూతులు రేకెత్తించేవి.

అయితే, మే మిద్దరం పరస్పరం కౌగిలిలో ఇరుక్కుపోవడం; బయిటకు వెళ్ళి అప్పుడే ఇంట్లోకి వచ్చిన శివరామయ్యగారు చూశారు. ఆ దృశ్యాన్ని సహించలేకపోయారు. ఆ మరుసటి దినం బలవంతంగా ఖాళీ చేయించారు.

అక్కణ్ణుంచి వెళ్ళిపోయింతర్వాత, నేను, రేఖ ఒక సంవత్సరం వరకు 'పబ్లిక్‌గార్డెన్స్'లో కలుసుకుని కబుర్లు చెప్పుకుంటూ తియ్యని కలలు కంటూ ఊహాలోకాల్లో విహరించేం.

ఇదంతా శివరామయ్యగారు గమనించి రేఖను ఇల్లు వదలి బయటకు రాకుండా గట్టి బందోబస్తు చేశారు. అంటే ఆయన ఇంట్లోనుంచి కదిలేవారు కాదుట. కదిల్తే, కూడా రేఖను తీసికెళ్ళేవారు. ఈ కారణాలవల్ల మేము ఆ తర్వాత రెండు సంవత్సరాలు కలసుకోలేకపోయాము. కనీసం ఉత్తరాలు కూడ వ్రాసుకోలేదు.


ఇప్పుడు నాకు వచ్చిన ఉత్తరం ఆమె మొదటి ఉత్తరం. కాని ఈ ఉత్తరం నాకు నిద్రహారాలులేకుండా చేసింది. నా రేఖ నాకు కాకుండాపోతోంది. గుండె లవిసిపోయినై ఒకవేళ రేఖ ఏమైనా అఘాయిత్యం చేసుకుంటుందా, ఏమో!! నా జీవితంలో ఎప్పుడూ నేను అంతగా మానసికంగా క్రుంగిపోలేదు. ఇప్పుదేం చెయ్యాలి?! ఔను, నేను ఏం చెయ్య గలను!! నాకు మా అమ్మ మినహా, నా తరపున సాయం చేయడానికి ఎవరూ లేరు. బుర్ర వేడెక్కిపోతోంది. ఏం చెయ్యాలి, ఏం చేయగలను. ఎన్ని ప్రశ్నలు ఎన్నో విపరీతమైన ఆలోచ నలు. అలానే ఆలోచిస్తూ ఆకాశం వంక చూస్తూ ఎంతసేపు వుండిపోయానో నాకే తెలీదు. విధివ్రాత ఎవరు తప్పించగలరు! అని నీరసపడి వూరుకున్నాను.

కాని ఒక్కటి మాత్రం నిజం. రేఖ నాకు చెందకపోతే, ఇంకెవరికీ చెంద కూడదు. ఒకవేళ ప్రపంచం మునిగి పోయినా సరే, నా కిష్టమే....

మళ్ళీ నాలుగు దినాలకు, రేఖ దగ్గ ర్నుండి ఉత్తరం. ఆతురతగా చింపి చదివాను.

"నా విజయ్! భగవంతుడు నా జీవితంతో చెలగాటాలు ఆడుతున్నాడల్లే వుంది. నా పెళ్ళి ఆగిపోయింది. అసలు వాళ్ళు, ఈ సంబంధం మాకు వొద్దు అని యిప్పుడు ఎందుకు అంటున్నారంటే....

నీకు మొదటి ఉత్తరం వ్రాసిం తర్వాత నాలుగోరోజున ఏమైందంటే... ఆ రోజు ఎంతోసేపు ఏడ్చి, ఏడ్చి రాత్రి ఎప్పుడు నిద్రపోయానో ఏమో .... అర్ధరాత్రి దాటిందో ఏమో నామీద ఏదో బిగువుగా పడుతున్నట్లు అనిపించింది. మెలకువ వచ్చి కళ్ళు తెరచి చూశాను. చిమ్మచీకటి. ఏమీ కనపడ్డంలేదు. ఎడం చేతిని పైకి ఆడించి తడిమి చూశాను, ఎవరో మగమనిషిది గడ్డం గట్టిగా తగి లింది. విపరీతమైన భయంవేసి కెవ్వున అరవబోయేసరికి వాడు చేత్తో నా నోరు మూసేశాడు. అప్పుడు గుండెలో చలి ప్రారంభమైంది నాకు. నా జీవితం, నా పవిత్రత అంతా సర్వనాశనం కాబోతుం దని గమనించాను. వెంటనే నాకు ఎక్కడలేని రోషం వచ్చింది. ఈ దుర్మార్గుడికి లొంగిపోకూడదు. ఆఖరి క్షణంవరకు పోరాడాలి అని నిశ్చయించు కున్నాను. ఒకవేళ నేను నిస్సహాయు రాలిగా మిగిలిపోతే, ఈ సంఘటన ఎవరికీ తెలీకుండానే వెంటనే చచ్చి



పోవాలి అనుకుంటూ చీకట్లో అటూ, ఇటూ నిశితంగా చూశాను. నా కుడిచేతి ప్రక్కన చిన్న 'స్టూలు' మీద రంగుకాగితాలు కత్తిరించి వదలిపెట్టిన ఒక చిన్న కత్తెర తళతళలాడుతూ, మెరుస్తూ కనపడింది. అప్పుడు విజయ్ః నా కెక్కడలేని ఆవేశం వొచ్చి, వెంటనే ఎడంచేత్తో వాడి గడ్డంపట్టుకుని, కుడి చేత్తో కత్తెర తీసుకుని వాడి గొంతుకలో కసుక్కున కసిదీరా గుచ్చాను. పెద్దగా, గట్టిగా మూలిగి, నన్ను వదలి క్రిందకు దూకి వాడు పారిపోయాడు. నా కేకలకు, వాడు పారిపోతున్న చప్పుడుకు మా నాన్నగారు లేచారు. "ఏమైందమ్మా !?" అంటూ కంగారుగా నాన్నగారు అడిగారు.

"ఎవడో గూండాగాడు నామీద అఘాయిత్యం చేయాలని వచ్చాడు. నేను ఈ కత్తెరతో గొంతుకలో గుచ్చేసరికి దొంగ వెధవ పారిపోయాడు" అని శ్వాస అపుకుంటూ చెప్పాను.

మా కేకలు, గోల అంతా విని చుట్టు ప్రక్కలవాళ్ళు లేచారు. సంగతి కనుక్కుని అటూ, ఇటూ పరుగెత్తారు. వాడు ఎక్కడా కనపడలేదు.

కాని నా బాధ ఏమంటే, వాళ్లెవరూ నా ధైర్యాన్ని మెచ్చుకోలేదు సరికదా, నెమ్మదిగా నా దగ్గరకు వచ్చి, 'వాడేమైనా చేశాడా నిన్ను' గుచ్చిగుచ్చి అడగడం మొదలుబెట్టారు. నే చెప్పిన జవాబు వాళ్ళకు నచ్చినట్లుగాని, వాళ్ళు దాన్ని నమ్మినట్లుకానిలేదు. నాకు చాల అసహ్యం వేసింది.

అయితే, ఆనోటా ఈనోటా ఈ సంగతి బంధువులద్వారానో, మరెలానో, పెళ్ళికొడుకు వాళ్ళ తలిదండ్రులకు తెలిసిందిట. 'ఛీ! అటువంటి పాపిష్ఠిపిల్ల మాకు వద్దు. ఈ సంగతి తెలిసింది కాబట్టి సరిపోయింది. లేకపోతే మా వంశ గౌరవం మట్టిలో కలిసిపోయేది. భగవంతుడు ఆఖరి నిమిషంలో మా కళ్ళు తెరిపించి, మా కెంతో మేలుచేశాడు'- అని ఏదో అడ్డమైన వాగుడు వాగారట.

విజయ్! మా నాన్నగారి దుఃఖం చూడలేకపోతున్నాను. కుమిలపోతున్నారు. శవంలా కనపడ్తున్నారు. పెట్టుకున్న పెళ్ళి ఆగిపోయింది. పోలీసు రిపోర్టు ఇవ్వకుండా ఎంత జాగ్రత్త పడినా ఈ దుర్వార్త మాత్రం అట్టుడికినట్లు వుడికిపోతోంది.

అందరూ నన్ను చెడ్డగా అనుకునే వాళ్ళేగాని నన్నెవరూ అర్థంచేసుకోవడం లేదు.

విజయ్! ఈ ప్రపంచంలో ఆడపిల్లగా పుట్టడం కంటే పెద్ద ఘోరం, అన్యాయం ఇంకేమీ లేదా!?

నీ సమక్షంలో బావురుమని ఏడవాలని, నీ వొడిలో ప్రాణాలు వదలాలని ఎంతో తహతహలాడ్తున్నాను. మా నాన్నేమో నా పెళ్ళి ఇక అసలు కాదేమోనని మరీ భయపడ్తున్నారు. పిచ్చివాడిలా గొణుక్కుంటున్నారు. మంచంనుండి లేవలేక పోతున్నారు.

కాని విజయ్! నీ రేఖ పవిత్రంగానే వుంది, నీ కోసం పవిత్రంగానే నిలిచి వుంది; వుంటా.


ఇట్లు
నీ రేఖ.

ఉత్తరం చదవగానే నా కళ్ళు చెమర్చాయి. ఇక లాభంలేదు. ఆత్మీయులు చాల కష్టంలో వున్నారు. పలుకరించి రావడం కనీస ధర్మం.

నా దగ్గర వున్న ఖరీదైన డ్రస్ వేసుకుని శివరామయ్యగారింటికి బయలు దేరాను. అయన మంచంమీద శవంలా పడివున్నారు. చెల్లాచెదురుగా పెళ్ళి కార్డులు క్రిందపడి వున్నాయి. ఒకటి తీసికొని పూర్తిగా చదివి మంచంమీద పెట్టాను.

ఆయన ఎంతోసేపు నావంక చూసి ఆఖరుకు "నువ్వటోయ్! ఏమిటి! ఇలా వచ్చావు, కూర్చో. అమ్మగారు బావున్నారా" నీరసంగా అడిగారు.

"అమ్మ బాగానే వుంది. కాని ఇంకా రెండురోజులలో పెళ్ళి పెట్టుకుని అలా




నీరసంగా దిగులుగా కూర్చున్నారేమిటి?” అని పెండ్లి కార్డులవంక చూస్తూ అడిగాను.

చాలా సేపటివరకు ఆయన మాట్లాడలేదు. చివరకు “ఏంచేస్తాం బాబు, మా రాతలు బాగోలేదు. పెళ్ళి ఆగిపోయింది,” పొంగివస్తున్న దుఃఖాన్ని చేయి అడ్డంపెట్టుకుని ఆపుకున్నారు.

“అయ్యో! అదేమిటండీ, అసలు కారణమేమిటి?” జవాబు చెప్పాలా వద్దా అని అయన చాలా సేపు తటపటాయించేరు. చివరకు నెమ్మదిగా ఇలా అన్నారు.

“ఎవడో గూండాగాడు మా అమ్మాయిని రాత్రిపూట ఏదో అఘాయిత్యం చేయబోతే, అమ్మాయి కత్తెర తీసుకుని వాడ్ని గుచ్చింది. వాడు పారిపోయాడు. ఇందులో అమ్మాయి తప్పేముంది? 'మీ అమ్మాయి మంచిదికాదు, అటువంటి నీచురాలు మాకొద్దు. కుక్క కతికిన కూడు మాకొద్దు,' అంటూ వాళ్ళు కబురు పంపారు. ఇది జరిగినప్పటినుండి మళ్ళా గూండాగాడు ఎప్పుడు వస్తాడో ఏం చేస్తాడోనని రాత్రుళ్ళు నిద్రలు మానుకుని కాపలాలు కాసుకుంటున్నాము.”

నేను శివరామయ్యగారి వంక చూశాను. ఊపిరి ఎంతో బాధగా, బరువుగా తీసుకుంటున్నారు.

“సారీ! మీరు క్షమిస్తానంటే ఒక సంగతి మీకు చెప్పాలని వుందండీ. కాని మీ రేమంటారోనని భయంగా వుంది. నాకీమధ్య ప్రమోషన్ కూడా వచ్చింది. ఇప్పుడు నేను మా ఆఫీసులో అసిస్టెంట్ అకౌంట్సు ఆఫీసర్ని. మరి మీరు మరోలా

అనుకోకపోతే, నన్ను అనుగ్రహించ దలచుకుంటే, మీ అమ్మాయిని ఇదే ముహూర్తానికి చేసుకోవడానికి నేను సిద్ధంగా వున్నాను." ఆ తర్వాత మాటలు పెగిలిరాలేదు. గుండె ధడ్‌ధడ్ అంటూ పెద్ద శబ్దంచేస్తూ కొట్టుకుంటోంది.

"బాబూ!! ఎంత మంచివాడవయ్యా! అంతకంటేనా! దేవుడే మా మొర ఆలకించి నిన్ను పంపినట్లున్నాడు." అంటూ సంతోషంతో మంచందిగి చిట్టిచిట్టి అడుగులువేస్తూ చిందులు మొదలెట్టారు.

* * *

అదే తారీఖు, అదే ముహూర్తానికి మా పెళ్ళి వైభవంగా జరిగింది.

మొదటి రాత్రి— "ఏమిటండీ, మీరు మరీను. అంత అమాయకంగా వుంటే ఎలా. అంత చక్కని 'డ్రస్' వేసుకుని ఆ మెడచుట్టూ ఆ మురికి మఫ్లర్ ఏమిటి? మొన్న మా నాన్నగారి దగ్గరకు వచ్చినప్పుడు కూడా అలానే వచ్చారు. అబ్బ! తీసెయ్యండి," అంటూ నా శ్రీమతి రేఖావిజయ్ నా మఫ్లర్ గుంజి అవతల పారేసింది.

మెడవంక చూసింది. రెండు పెద్ద గంట్లు గొంతుకకు రెండు ప్రక్కలా కొట్టవచ్చినట్లు కనపడ్డాయి ఆమెకు.

అవాక్కయి, గుడ్లప్పగించి అలానే నావంక చూస్తోంది.

"నన్ను క్షమించు రేఖా! ఏదో విధంగా నిన్ను దక్కించుకోవాలని, నా భార్యగా చేసుకోవాలని ఎంతో తపనపడి అలా చేయాల్సివచ్చింది. అంతేకాని నీకు కీడు తలపెట్టే ఉద్దేశ్యం మాత్రం నాకు లేదు. నన్ను నమ్ము ప్లీజ్!"

మబ్బుల్లోనుండి చంద్రుడు దూసుకుంటూ వచ్చి వెన్నెల్ని లోకమంతా విరజిమ్మినట్లు రేఖ హాయిగా తృప్తిగా నవ్వింది. పద్మాలు వికసించినట్లు మల్లెమొగ్గలు అకస్మాత్తుగా విచ్చుకున్నట్లు, ఎంతో చక్కగా నవ్వుతూ ఆకాశం అంతా నేలని అలముకున్నట్లు నన్ను అలుముకుని గట్టిగా కౌగలించుకుంది. "నా విజయ్! నా విజయ్! ఎంత గొప్పవాడివి, ఎంత మంచివాడివి" అంటూ తియ్యగా మూలిగింది.

కుడిచేత్తో ఆమెను వొడిసి పట్టుకుని, ఎడంచేత్తో బెడ్‌లైట్ 'ఆఫ్' చేశాను.

